

నష్టాల్లో రైతులు..
పసుపు పండించిన రైతులకు నష్టాలు మిగులుతుండగా.. పంట కొన్న దళారులు మాత్రం లాభపడుతున్నారు.
- 8లో ▸



పోడు రైతులందరికీ పట్టాలు
కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోడు రైతులందరికీ అటవీ హక్కు పట్టాలు ఇస్తామని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0 /24.3
ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు

నిజామాబాద్‌అర్బన్ : ఎంసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించి మార్పులు చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అదనపు సీట్లను కేటాయించడంతో పాటు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ప్రకటించడంతో కౌన్సెలింగ్ షెడ్యూల్లో మార్పులు చేసినట్లు ఆయన వివరించారు. ఈ నెల 7, 8తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో..

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటలో తెలిపారు. ప్రభుత్వం అదనపు సీట్లను కేటాయించడం, పదో తరగతి సప్లిమెంటరి ఫలితాలు రావడంతో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. 10న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఎల్‌ఆర్ ఏడీ శ్రీనివాసులు

సుభాష్‌నగర్ : జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌ఎల్‌ఆర్) అసిస్టెంట్ డైరెక్టర్‌గా సీహెచ్ శ్రీనివాసులు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ ఏడీగా విధులు నిర్వర్తించిన శ్యాంసుందర్ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నేతికుంట శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, వెంకటేష్, పోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫలక్‌నుమా ప్రమాదంతో పలు రైళ్లు రద్దు

ఖలీల్‌వాడి : ఫలక్‌నుమా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్లే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. సికింద్రాబాద్ నుంచి మన్మాడ్ ఎక్స్‌ప్రెస్, అజంతా ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్ నుంచి నాగర్‌సోల్ వెళ్లే రైళ్లు రద్దు చేసినట్లు ప్రకటించింది.

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. జిల్లావ్యాప్తంగా 2,754 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 2,289 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 84.36 శాతం, బాలురలు 82.13 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్ కోసం ఈ నెల 10 నుంచి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్ : మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మైనారిటీ అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత పరీక్షల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సెంటర్‌లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

సుభాష్‌నగర్ : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ముఖ్యంగా జీవో నంబర్ 58, 59, 76, 118 కింద భూముల క్రమబద్ధీకరణ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణిలో నూతన ఆప్షన్ తదితర అంశాలపై సూచనలు చేశారు. భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపేందుకు బృందాలను ఏర్పాటు చేసి నెలరోజుల వ్యవధిలో అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. నకిలీ, డబుల్ సర్వే నంబర్ల పరిష్కారానికి మాడ్యుల్ తహసీల్దార్ లాగిన్‌లో, పాస్‌పుస్తకాల్లో తప్పులుంటే సవరించే అధికారాన్ని కలెక్టర్ లాగిన్‌లో అందించామని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవోలు రవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆయకట్టు పునర్జీవం



ఎస్సారెస్పీలోకి వస్తున్న కాళేశ్వరం జలాలను వీక్షిస్తున్న రైతులు, ప్రజలు

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కాళేశ్వరం జలాల తరలింపు
- జిల్లాలో సుమారు 58 వేల ఎకరాల అదనపు ఆయకట్టు స్థిరీకరణ
- ఎస్సారెస్పీ ఆధారిత పథకాలకు జలకళ

బాల్కొండ : పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం జలాలను శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి తరలించడంతో ఆయకట్టు స్థిరీకరణకు భరోసా ఏర్పడింది. శుక్రవారం కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీలోకి వదిలారు. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా రోజుకు ఒక టీఎంసీ చొప్పున 60 రోజుల పాటు మొత్తం 60 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి అందించాలి. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వలన రోజుకు 0.5 టీఎంసీల నీటిని తరలించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇదిలా ఉండగా ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఎగువన ఉన్న మహారాష్ట్ర సర్కార్ అనేక బ్యారేజీలను అడ్డు గోడలా నిర్మించింది. దీంతో ఎస్సారెస్పీకి వరదలు రావడం గగనమవుతోంది. ఈ ఏడాది వర్షాలు, వరదలు లేక ప్రశ్నార్థకంగా మారుతున్న శ్రీరాంసాగర్ ఆయకట్టుకు పునర్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీరందనుంది.

ఎత్తిపోతల కింద..

వేంపల్లి ఎత్తిపోతల పథకం కింద వేల్పూర్, బాల్కొండ మండలాల పరిధిలోని 22 వేల ఎకరాలు, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల కింద మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో 11,200 ఎకరాలు, లక్ష్మి కాలువ కింద 25 వేల ఎకరాలు కాళేశ్వరం జలాలతో జీవం పోసుకోనున్నాయి. అదేవిధంగా కాకతీయ కాలువ కమ్మర్‌పల్లి మండలం ఊప్లూర్ వరకు జిల్లాలో 22 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. కాలువ ఉప కాలువల ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతుంది. 60 టీఎంసీల రివర్స్ పంపింగ్‌తో వరద కాలువలో ఏడాదంతా నీళ్లుండే అవకాశాలున్నాయి. తద్వారా కమ్మర్‌పల్లి నుంచి ఎస్సారెస్పీ వరకు వరద కాలువ పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి.

నాలుగు మోటార్లతో..

బాల్కొండ : కాళేశ్వరం జలాలు ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరాయి. శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, రేఖానాయక్, విఠల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావుతో కలిసి మూడో పంపు వద్ద బటన్ నొక్కి మోటార్లను ప్రారంభించారు. దీంతో నాలుగు మోటార్ల ద్వారా నీరు జలాశయంలోకి చేరింది. అనంతరం కాళేశ్వరం నీళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, వీజీగౌడ్, రాజేశ్వర్, డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నరసింహానాయుడు, ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, ముస్కు భూమేశ్వర్ పాల్గొన్నారు.

తీరిన నీటి కష్టాలు

- ఫలితాన్నిస్తున్న ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం
- కేసీఆర్ నాయకత్వంలో రైతుకు మేలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాల్కొండ : ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో సాగు నీటి కష్టాలు తీరాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతు సాగు చేయుటకు విత్తనం, నీరు, కరెంట్ ఉండాలన్నారు. రైతు బంధులో పంట పెట్టుబడి కింద రైతు విత్తనం కొంటున్నాడని, ప్రాజెక్టుల ద్వారా, 24 గంటల కరెంట్ సరఫరాతో పంటకు నీరందుతుందన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్ర శివారులో వరద కాలువ జీరో పాయింట్ వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా ఎస్సారెస్పీలోకి నీటి విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

అపూర్వ ఘట్టం..

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీళ్లను శ్రీరాంసాగర్‌లోకి తరలించడం అపూర్వ ఘట్టమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం నుంచి వరద కాలువ ద్వారా రివర్స్‌పంపింగ్‌తో ఎస్సారెస్పీ ఆయకట్టుకు పునరుజ్జీవం పోసిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. కొద్దిపాటి వర్షం సహకరిస్తే ఎస్సారెస్పీ ఆయకట్టు రెండు పంటలకు నీరు అందించవచ్చన్నారు.

సీఎంగా కేసీఆర్ లేకుంటే ..

తెలంగాణకు సీఎంగా కేసీఆర్ లేకుంటే రాష్ట్ర ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ప్రారంభించడం చారిత్రాత్మకమన్నారు. కొన్ని పార్టీలు లేని పోని మాటలు చెప్పి బీఆర్ఎస్‌ను ఓడించి సీఎంగా కేసీఆర్‌ను తప్పించాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

ప్రతిఫలం దక్కుతుంది..

ఎస్సారెస్పీ పునరుజ్జీవంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో భూములను కోల్పోయిన రైతులకు, పునరావాస గ్రామాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీళ్లు అంది ప్రతిఫలం దక్కుతుందని రాష్ట్ర దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రాణహిత చెవేళ్ల నుంచి నీటిని ఒడిసి పట్టి పలు బ్యారేజీలు నిర్మించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు.


ఎస్సారెస్పీలోకి కాళేశ్వరం జలాల ఎత్తిపోతలను ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఫ్లెక్సీలో ఎంపీ ఫొటో ఎందుకో..

పసుపు బోర్డు తెస్తానని రైతులను ఎంపీ అర్వింద్ మోసం చేశాడని, అటువంటి ఎంపీ ఫొటోను ఫ్లెక్సీలో ఎందుకు పెట్టారో అర్థం కాలేదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. ఫేక్, ఫ్రాడ్ ఎంపీకి ఏం ప్రొటోకాల్ అని అన్నారు. పునరుజ్జీవంతో అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలకు, ముంపు లిఫ్టులకు నీరందుతుందన్నాడు. చదువురాని వాళ్ల సంఘానికి అధ్యక్షుడు ప్రధాని నరేంద్ర మోదీ అని విమర్శించారు.

మాజీ ప్రధాని పీవీ ఊహించి ఉండరు..

వరద కాలువ నిర్మాణానికి శంకు స్థాపన చేసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా కాళేశ్వరం జలాల తరలింపునకు వరద కాలువ ఉపయోగ పడుతుందని ఊహించి ఉండరని ఎమ్మెల్యే,ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. పసుపు బోర్డు తీసుకురాలేక పోయిన ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కంటే ఎక్కువ తెచ్చామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రైతులు పసుపు పంటను క్వింటాలు రూ.4 వేలకు అమ్ముకుంటే ఇప్పుడు దళారులు రూ. 9 వేలకు అమ్ముకుంటున్నారన్నారు.

కార్యక్రమంలో ఖనాపూర్, ముథోల్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, మహిళ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, వీజీగౌడ్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, జిల్లాకలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీతఈ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరద కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్పీకర్


సభలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, రేఖానాయక్ తదితరులు


ఎస్సారెస్పీలో కలుస్తున్న కాళేశ్వరం నీళ్లు

ఆస్పత్రుల్లో వసతులు కల్పించాలి

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి
- జీజీహెచ్, మెడికల్ కళాశాల సందర్శన

నిజామాబాద్ సిటీ : సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పించి, నాణ్యమైన వైద్యం అందించాలని మాజీ మంత్రి పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. జీజీహెచ్‌కు రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటుచేసి, సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. ప్రజలు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోవద్దనే ఉద్దేశంతో తాను మంత్రిగా ఉన్న సమయంలో అన్ని సదుపాయాలతో ఆస్పత్రిని తీర్చిదిద్దినట్లు చెప్పారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా ఆస్పత్రిలో సరైన వైద్య పరికరాలు, సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం మాజీమంత్రి మెడికల్ కళాశాలను సందర్శించి అక్కడున్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని మెడికల్ కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కళాశాలలో సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనబడుతుందన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, కేశవేణు, అంతిరెడ్డి రాజరెడ్డి, నరాల రత్నాకర్, దయాకర్‌గౌడ్, విక్కీ యాదవ్, వేణు రాజ్, విపుల్ గౌడ్, రాజ నరేందర్ గౌడ్, రాంభూపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నర్సుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

క్వారీ మూసివేతపై హర్షం

- 'సాక్షి' కథనాలను ప్రస్తావిస్తూ...
- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన బీజేపీ నాయకులు

మోర్తాడ్/కమ్మర్‌పల్లి : ఏర్గట్ల మండలం బట్టాపూర్ క్వారీ మూసి వేయాలని హైకోర్టు తీర్పు చెప్పడంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. క్వారీ అక్రమాలను 'సాక్షి' గతంలో వెలుగులోకి తీసుకు రాగా, దీనిపై బీజేపీ నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణకు స్వీకరించిన ధర్మాసనం క్వారీ నిర్వాహకులకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో బీజేపీ శ్రేణుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ సంతోషానికి రూపంగా బట్టాపూర్ క్వారీ విషయాలను పేర్కొంటు ప్రచురించిన ఫ్లెక్సీలను బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం ఏర్పాటు చేశారు. అందులో 2022 డిసెంబర్ 9న సాక్షి పత్రిక ప్రచురించిన గుట్టలు గుల్ల కథనం చిత్రాలను ముద్రించారు. నామమాత్రపు అనుమతులతో భారీగా బండరాయి కొల్లగొట్టడంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవడంతో పాటు, పర్యావరణానికి ఏర్పడిన ముప్పు ఇతరత్రా అంశాలను ఫ్లెక్సీలో రాయించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెనుక ఉండి తన బంధువులతో క్వారీని అక్రమంగా నిర్వహించారని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో తమకు విజయం లభించిందని బీజేపీ నాయకులు వివరించారు. గురువారం అన్ని మండల కేంద్రాల్లో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు.


బట్టాపూర్ క్వారీపై హైకోర్టు తీర్పుతో భీమ్‌గల్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు


కమ్మర్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ముడుపులు ముట్టుకోవద్దు!

- అటవీ శాఖలో ఏసీబీ ఫీవర్
- లంచాలు, మామూళ్లకు మరిగిన అధికారుల్లో భయం

డొంకేశ్వర్(ఆర్మూర్) : కామారెడ్డిలో ఫారెస్ట్ బీట్ ఆ ఫీసర్ (ఎఫ్‌బీవో) శ్రీనివాస్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఉదంతంతో జిల్లా ఫారెస్టు శాఖ కూడా ఉలిక్కి పడింది. ఎఫ్‌బీవో శ్రీనివాస్ మొన్నటి వరకు నిజామాబాద్‌లో పని చేసిన వ్యక్తే. ఫారెస్టు అధికారుల్లో కొంత మంది లంచాలు తీసుకుంటున్నారనే సమాచారం ఏసీబీ అధికారులకు ఉంది. దీంతో అటవీ శాఖలో కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల దాకా అలర్టయ్యారు. కొన్ని రోజులు లంచాలు, మామూళ్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఆర్నెళ్లు, ఏడాదికోసారి 'లెక్క'

జిల్లాలోని అటవీ శాఖ అధికారుల్లో కొంతమంది అవినీతి, అక్రమాలు, మామూళ్లే ధ్యేయంగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కలప, టేకును విక్రయించే టింబర్ డిపోలు, సా మిల్లులతో పాటు కార్పెంటర్ షాపుల యజమానులతో సదరు అధికారులు మంచి సంబంధాలు పెట్టుకున్నారు. తనిఖీలు, పర్యవేక్షణ మాటే లేకుండా మిలాఖత్ అయ్యారు. బిల్లుల్లేని, అక్రమ కట్టెను విక్రయించినా ఎలాంటి చర్యల్లేకుండా 'లెక్క' కొద్ది ముడుపులను తీసుకుంటున్నారు. కొందరు ఆర్నెళ్లకోసారి, మరి కొందరు ఏడాదికోసారి ఠంఛనుగా మామూళ్లు పొందుతున్నారు. లైసెన్సులు లేకుండా దుకాణాలు నడుపుతున్న వారికి సైతం కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు చాలా ఉన్నాయి. ఆర్మూర్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న అధికారి ఒకరు ఏకంగా 'ఓపెన్' వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. యూనియన్‌లో ఆర్నెళ్లకు ఒకసారి కూర్చొని సదరు సారుకు వేలల్లోనే డబ్బులు అందజేయాల్సి వస్తోందని పలు టింబర్ డిపోలు, సా మిల్లులు, కార్పెంటర్ దుకాణాల యజమానులు వాపోతున్నారు. కాగా గతంలో ఉడుమును వేటాడి పట్టుబడిన ఒక వేటగాడిని బెదిరించి రూ.30 వేలకు పైగానే వసూల్ చేసినట్లు తెలిసింది.



ఎవరి వాటా వారికే..

అటవీ అధికారులకు టింబర్ డిపోలు, సా మిల్లులు, కార్పెంటర్ దుకాణాలు బంగారు బాతుల్లా మారాయి. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న అధికారులు సమయం రాగానే మామూళ్లను అందుకుంటున్నారు. వచ్చిన ముడుపులు వారికే పరిమితం కాకుండా పైస్థాయి అధికారులను మేనేజ్ చేయడానికి వారికి కూడా వాటాను ముట్టజెప్తున్నారు. ఎప్పటికప్పుడు పైకం అందడంతో ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

> **అవినీతికి పాల్పడితే సహించం**
>
> అటవీ శాఖలోని ఉద్యోగులు, అధికారులు ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. అలాంటి వారిని వెంటనే సస్పెండ్ చేస్తాం. టింబర్ డిపోలు, సా మిల్లులు, కార్పెంటర్ దుకాణాల నుంచి వసూళ్లు చేస్తున్నారనే విషయం నా దృష్టికి ఇంత వరకు రాలేదు.
>
> – వికాస్ మీనా, జిల్లా ఫారెస్ట్ అధికారి

నష్టాల్లో రైతులు.. లాభాల్లో దళారులు

- పసుపు నిల్వపై అవగాహన లోపం
- వచ్చిన ధరకే అమ్ముకుంటున్న రైతులు
- నిల్వ ఉంచి, ధర పెరిగినపుడు విక్రయిస్తున్న మధ్యవర్తులు


ఆర్మూర్ ప్రాంతంలో పసుపును శుద్ధి చేస్తున్న రైతులు (ఫైల్)

ఆర్మూర్: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర లభించకపోగా.. వచ్చిన ధరకే అమ్ముకుంటూ నష్టాలపాలవుతున్నారు. కానీ రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీలలో దాచుకున్న దళారులు మాత్రం ధర పెరిగినపుడు పంటను అమ్ముకొని లాభపడుతున్నారు. అందుకు నిదర్శనం ఇటీవల జిల్లాలో పసుపు ధర క్వింటాలుకు 9,249 రూపాయలు పలకడమే. కానీ ఈ పాటికి 80 శాతం మంది రైతులు తమ పంటను వచ్చిన ధరకు అమ్ముకున్నారు. ప్రస్తుతం అధిక ధరకు పసుపు పంటను అమ్ముకున్న 20శాతం మంది మాత్రం రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీలో భద్రపరుచుకున్న దళారులే.

పంట నిల్వపై రుణ సదుపాయం..

రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకంలో భాగంగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఈ పంట నిల్వ రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది. రైతులు పండించిన పంటలను కోల్డ్ స్టోరేజీలు, గోదాములలో నిలువ ఉంచి, ఆ పంటను తాకట్టు పెట్టుకొని అతి తక్కువ వడ్డీతో రుణం పొందే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మార్కెట్‌లో ఉన్న ధరలో 70 శాతం మొత్తాన్ని రైతులకు రుణం రూపంలో అందజేస్తారు. రుణం పొందిన తరువాత ఆరు నెలల పాటు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ తరువాత పావలా వడ్డీని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకున్న తర్వాత ఈ రుణం చెల్లించే అవకాశం ఉంటుంది. పెట్టుబడి అధికంగా పెట్టి పండించిన పంటలనే కాకుండా ఆరుతడి పంటలైన సోయాబీన్, మొక్కజొన్న, కూరగాయలను సైతం రైతులు ఎప్పటికప్పుడు అమ్ముకోవడం వారిని నష్టాల పాలు చేస్తోంది. ఈ ఏడాది సైతం పసుపు, ఎర్రజొన్న పంటలకు రైతులు ఆశించిన ధర లభించడం లేదు. అయినా వచ్చిన ధరకే నష్టానికి పంటను అమ్ముకున్నారు. అంతేగాని పంటను నిల్వ ఉంచి బహిరంగ మార్కెట్‌లో ధర పలికినపుడు అమ్ముకోవాలనే ఆలోచన మాత్రం చేయడం లేదు. పాలకులు సైతం వారిని ఆ దిశగా నడిపించడంలో విఫలమవుతూనే ఉన్నారు. ఆర్మూర్ ప్రాంతంలో ఇటీవల కోల్డ్ స్టోరేజీల నిర్మాణం సైతం జరగడంతో రైతులు పంటను నిల్వ ఉంచుకునే ఆలోచనలు చేస్తే మరింత లాభపడటానికి ఆస్కారం ఉంటుంది.

వ్యవసాయశాఖ నిర్లక్ష్యం

ఆర్మూర్ ప్రాంతంలో పండించిన పంటలను నిలువ ఉంచి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర పలికినపుడు అమ్ముకునే విధానంపై రైతులకు అవగాహన లేకపోవడంతో దళారులకు విక్రయించి, ఆర్థికంగా నష్టపోతున్నారు. నాణ్యతను బట్టి క్వింటాలు పసుపు కొమ్మును రూ.నాలుగు వేల నుంచి రూ.8వేల వరకు అమ్ముకుంటున్నారు. కానీ పంట రైతుల చేతుల్లో నుంచి మధ్య దళారుల చేతుల్లోకి వెళ్లగానే ధర అమాంతం పెరిగిపోవడం పరిపాటిగా మారింది. ఈ తంతు ప్రతీ ఏడాది కొనసాగుతూనే ఉంది. రైతులు ఆర్థికంగా నష్టపోతూనే ఉన్నారు. మధ్య దళారీలు లాభపడుతూనే ఉన్నారు. పంటలను నిల్వ ఉంచడంపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రతీ ఏడాది రైతులు మద్దతు ధర కోసం రోడ్లెక్కి ఉద్యమాలు చేయడం పరిపాటిగా మారింది.

పంట నిల్వపై అవగాహన ఉండాలి



రైతులందరు పండించిన పంటను ఒకే సమయంలో మార్కెట్‌లోకి తీసుకురావడంతో దిగుబడి అధికంగా వచ్చి ధర తగ్గడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రైతులు పంటను నిల్వ ఉంచుకొని రుణాలు పొంది, గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకోవాలి. దీంతో ఆర్థికంగా లాభపడవచ్చును.

– కోటపాటి నర్సింహ నాయుడు, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్మూర్

క్లుప్తంగా

రెజ్లింగ్ క్రీడాకారులకు చేయూత



సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్: ఆర్మూర్ నుంచి అంతర్జాతీయ రెజ్లింగ్(కుస్తీ)పోటీల్లో పాల్గొనడానికి ఎంపికైన క్రీడాకారులు డాకూరి భానుప్రసాద్, ఓర్స్ మహేష్‌లకు శుక్రవారం ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు తమ వంతు సహకారాన్ని అందజేశారు. రెజ్లింగ్ క్రీడలో అంతర్జాతీయ స్థాయి కి ఎదిగి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మిత్రులు భానుప్రసాద్, మహేష్‌లపై 'చేయూతనందించరూ' అనే శీర్షికతో గురువారం సాక్షి లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పలువురు దాతలు వారికి సహాయం అందించడానికి ముందుకు వస్తున్నారు. బీజేపీ నాయకుడు రాకేష్‌రెడ్డి, ఆర్ఆర్ ఫౌండేష్ ప్రతినిధి సుచరిత ఆధ్వర్యంలో రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సీఎస్ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాల మేనేజర్ సువర్ణకిరిటీ, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు సుధా, రాజేష్ పాల్గొన్నారు.

10 నుంచి ఓపెన్ స్కూల్లో ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 10 నుంచి ఓపెన్ స్కూల్లో పదవ తరగతి, ఇంటర్ తరగతుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ రుసుంతో ప్రవేశ ఫీజు పదో తరగతి విద్యార్థులకు రూ.1550, ఇంటర్మీడియట్ వారికి రూ. 1800 ఆగస్టు 10 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 11నుంచి, 31 వరకు పదోతరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు రూ.100 రూపాయల అపరాధ రుసుముతో, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ పొందే వారికి రూ.200 అపరాధ రుసుముతో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ప్రవేశ రుసుమును టీఎస్ ఆన్‌లైన్‌లో, ఏపీ ఆన్‌లైన్‌లో, మీ సేవ సెంటర్లలో చెల్లించవచ్చునన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రవేశ రుసుంలో రాయితీ కల్పించినట్లు డీఈవో తెలిపారు. వివరాలకు 8008403518నుసంప్రదించాలన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్


సిరికొండ: మండలంలోని నారాయణపల్లె గ్రామంలో పూజారి లక్ష్మి ఇంట్లో చోరీకి పాల్పడిన గుర్రం రాజేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నర్సింలు శుక్రవారం తెలిపారు. నిందితుడిని అతడి ఇంటి వద్ద అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి బంగారు కమ్మలు, మాటిలు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో శుక్రవారం పట్టీలు లేకుండా రహదారిపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. పట్టీలు లేకుండా కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడపడం ప్రభుత్వం నిషేధించిందన్నారు. పట్టీలు లేకుండా నడిపించే కేజ్‌వీల్ ట్రాక్టర్లను కచ్చితంగా సీజ్ చేస్తామని, రైతులు గమనించాలని ఎస్సై పేర్కొన్నారు.

చిన్ని హృదయాన్ని ఆదుకోరూ!

- 8నెలల బాబుకు గుండెజబ్బు
- విదేశాల్లోనే వైద్య సదుపాయం
- దాతల కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు


నీలోఫర్‌లో చికిత్స పొందుతున్న శిశువు

మాచారెడ్డి: ఆ శిశువు వయస్సు 8నెలలు. పుట్టుకతోనే గుండె జబ్బు సోకింది. కానీ 25రోజుల కింద వ్యాధి బయట పడటంతో చిన్నారిని బతికించుకోవడానికి నిరుపేద తల్లిదండ్రులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలు ఇలా..

మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన దంపతులు అమ్జద్, అఫ్రిన్‌లకు కుమారుడు రయాన్(8నెలలు) ఉన్నారు. 25రోజుల కిందట రయాన్ అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే ఆ దంపతులు చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొంచెం ఆరోగ్యం కుదుటపడగానే ఇంటికి వచ్చారు. మళ్ళీ వారం రోజుల తర్వాత జబ్బు చేసి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కలగడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు జెనెటికల్ గుండె జబ్బుగా నిర్ధారించారు. ఆ జబ్బుకు ఇండియాలో చికిత్స లేదని, విదేశాలకు తీసుకెళ్లాలని వైద్యులు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. విదేశాలకు వెళ్లాలంటే పెద్ద మొత్తంలో డబ్బు కావాలని, అంత డబ్బు తమ వద్ద లేదని దాతల సహాయం కోసం ఆ నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఫోన్ పే, గూగుల్ పే
అఫ్రిన్- 9110553872

పోడు రైతులందరికీ అటవీ హక్కు పట్టాలు

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి
- గ్రామాల్లో పోడు భూముల పరిశీలన


బాధితులతో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పోడు రైతులందరికీ అటవీ హక్కు పట్టాలు ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉన్యానాయక్ తండా, మోతీరాం తండా, రామేశ్వర్‌పూర్ తండా, ఉమ్లా నాయక్ తండా, బైరాపూర్, కాల్పోల్ తండాల్లో శుక్రవారం పోడు భూములను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. 2005 కంటే ముందు నుంచి సాగు చేసుకుంటున్న వారికి అటవీహక్కు పట్టాలు ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించిందని, కానీ ఇక్కడ 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారికి ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేవలం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న వారికి, వారి బంధువులకు మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా 32,500 ఎకరాలకు 14,500 మంది పోడు రైతులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 5వేల మందికి 8వేల ఎకరాలకు మాత్రమే అటవీ హక్కుపట్టాలు ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన గిరిజన రైతుల నుంచి రూ.లక్ష వసూలు చేసి పట్టాలు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రాజెక్ట్ ముంపు పేరుతో పట్టాలు ఆపడం సరికాదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాత డిజైన్ ప్రకారం మంచిప్ప పనులు చేపట్టి, అర్హులందరికీ పట్టాలు ఇస్తామని భరోసానిచ్చారు. కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేసేవారని ఎమ్మెల్యే బాజిరెడ్డి వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకులే మొరం, ఇసుక, మట్టి, ఇతర సహజ వనరులను అమ్ముకుని దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, నాయకులు ఉన్యానాయక్, దేవేందర్, ఈశ్వర్‌సింగ్, భూపతి, అనిల్‌రెడ్డి, మోతిలాల్, శేఖర్‌రెడ్డి, రవి, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం అభినందనీయం


ఐసీయూ వార్డును ప్రారంభిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ సిటీ: కార్పొరేట్ స్థాయి వైద్యం పేదలకు అందకుండా ఉన్న ఈ రోజుల్లో ఎలాంటి లాభం ఆశించకుండా ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్ ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రిలో గ్రేస్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 పడకల ఐసీయూ వార్డును శుక్రవారం కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. ఈ ఆస్పత్రిలో నిత్యం 100 మందికి కీమో, రేడియోషన్, 40 సర్జరీలు చేయటం అభినందించదగిన విషయమన్నారు. ఇక్కడ అయ్యే ఖర్చు ఆరోగ్యశ్రీతో జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఇందూర్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాయిబాబును సన్మానించారు. ఎమ్మెల్సీ రాజేశ్వర్, ప్రోగ్రాం మేనేజర్(ఇన్ఫోసిస్ ఫౌండేషన్) వంశీ ముత్యపు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ చినబాబు సుంకవల్లి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డాక్టర్ వినాయక్‌రెడ్డి, కిరణ్, ప్రద్యుమ్నరెడ్డి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫలితాల్లోనూ వెనుకంజే

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం వెలువడగా.. ఉత్తీర్ణత శాతంలో జిల్లా వెనుకంజలో నిలిచింది. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లోనూ 50శాతం మాత్రమే ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 10223 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 5865 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, 57 శాతం ఉత్తీర్ణత నమోదయింది. రెండో సంవత్సరం ఫలితాల్లో 5415 మంది పరీక్షలు రాయగా 2948 మంది ఉత్తీర్ణులయ్యారు. 54శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 1062 మంది విద్యార్థులకు 562 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 52శాతం ఉత్తీర్ణత నమోదయింది. సెకండియర్‌లో 630 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 321 మంది ఉత్తీర్ణత సాధించారు. 50శాతం ఉత్తీర్ణత నమోదయింది.

ప్రజలతో సత్సంబంధాల కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

ఖలీల్‌వాడి: ప్రజలతో సత్సంబంధాల కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బిలాల్‌నగర్, జెన్నపల్లి ఎక్స్ రోడ్డులో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు పోలీసులు ఇంటింటికీ తిరిగి వాహనాల డాక్యుమెంట్లు, కొత్తగా వచ్చిన వారి వివరాలను సేకరించారు. 64 బైక్‌లు, 24 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే డయల్ 100 లేదా 1930ను, లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కొత్త వ్యక్తులు వస్తే ఇల్లు కిరాయికి ఇవ్వవద్దని వారి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత ఇవ్వాలని తెలిపారు. సీసీ కెమెరాలను ప్రతి చోట ఏర్పాటు చేసుకోవాలని, దీంతో నేరాలను నియంత్రించవచ్చునని చెప్పారు. సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళ పోలీసులు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ఆటోనగర్ కాలనీలో శుక్రవారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని ఇంటింటికీ వెళ్లి వాహనాల పత్రాలను ఆరాతీశారు. పత్రాలు లేని 13 బైక్‌లు, 93 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో కొత్తగా వచ్చిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐలు ప్రేమ్‌కుమార్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బోధన్‌లో సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వరి నారుతో పేరు



జై కాంగ్రెస్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ చిన్నా పేరును వరి నారుతో చిత్రీకరించిన రాటం అరుణ్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాటం అరుణ్ తన పొలంలో వరి నారుతో టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ చిన్నా పేరును లిఖించి అభిమానం చాటుకున్నారు. తన పొలంలో జై కాంగ్రెస్ ఏబీ చిన్నా అని వరి నారుతో అక్షరాలను లిఖించాడు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి బీఆర్ఎస్ పాలనపై విసిగిపోయిన ప్రజలు త్వరలో కాంగ్రెస్‌కు పట్టం కడుతారన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన ఓ జాలరి చేపల వేటకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోస్లీ గ్రామానికి చెందిన డప్పు సాయన్న(50) శుక్రవారం అలీసాగర్ లిఫ్ట్ కాలువలో చేపల వేటకు వెళ్లాడు. నీటిలో వల వేసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల అతడి కాళ్లు, చేతులకు చిక్కుకుపోవడంతో నీటిలో పడిపోయాడు. ఈత కొట్టేందుకు వల అడ్డంకిగా మారడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి కుమారుడు డప్పు నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి, బురదలో పడి ఒకరు..

మాచారెడ్డి: బైక్ అదుపు తప్పి బురదలో పడిన ఓ యువకుడు ఊపిరాడక మృతి చెందిన ఘటన శుక్రవారం మాచారెడ్డిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన రాచర్ల రమేష్(45)జేసీబీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. జేసీబీ ఫిల్టర్ చెడిపోగా శుక్రవారం ఫిల్టర్‌ను బైక్‌పై పెట్టుకొని గజ్యానాయక్ తండాకు బయలుదేరాడు. చౌరస్తా దగ్గరలో ఉన్న కల్వర్టు సమీపంలో అతడి బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లింది. ముఖం బురదలో కూరుకుపోగా, బైక్ కాళ్లపై పడింది. దీంతో ఊపిరాడక అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


రమేష్ (ఫైల్)

'మోడల్' హాస్టల్‌లో చోరీకి యత్నం

- భయంతో ఇంటిదారి పట్టిన విద్యార్థినులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట మోడల్‌స్కూల్ హాస్టల్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు చోరీకి యత్నించాడు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు సంబంధించిన హాస్టల్‌లో గత రాత్రి గుర్తుతెలియని ఓ దుండగుడు హాస్టల్‌లోని వంటగదికి ఉన్న శిథిలమైన తలుపులను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించాడు. వెంటనే మేల్కొన్న సిబ్బంది దుండగుడిని గమనించి కేకలు వేశారు. దీంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. సిబ్బంది ఎంత వెతికినా అతడి జాడ కనిపించక పోగా, ఒక జత చెప్పులు, వంట సామగ్రితో కూడిన బ్యాగు కనిపించాయి. శుక్రవారం వేకువజామున చెప్పులు, బ్యాగు కనిపించకుండాపోవడంతో సదరు దుండగుడు మళ్లీ వచ్చినట్లు హాస్టల్ సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన విద్యార్థినులు ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా స్కూల్‌కు రెండురోజులు సెలవులు ఉండడంతోపాటు హాస్టల్ వంటగది తలుపులు సరిగ్గా లేవనే కారణంతో రెండు రోజులపాటు హోంసిక్ సెలవులు ఇచ్చామని హాస్టల్ నిర్వాహణ అధికారిణి వీణ తెలిపారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురికి రిమాండ్

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఎర్ర కావ్యశ్రీ(26) ఆత్మహత్యకు కారకులైన ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. వివాహిత కావ్యశ్రీని అదనపు కట్నం తేవాలని భర్త మనోజ్, అత్త మామలు అరుణ, మహేష్‌లు తరచూ వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మృతురాలి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు విచారణ అధికారి ఏసీపీ ఆదేశాల మేరకు ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మద్యం తాగి వాహనం నడిపించిన బాడ్సి గ్రామానికి చెందిన ఓమక్క గంగాధర్‌కు నిజామాబాద్ కోర్టు జడ్జి రెండ్రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ మహేష్ శుక్రవారం తెలిపారు. మోపాల్ చౌరస్తాలో గురువారం రాత్రి పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించారు. బాడ్సికి చెందిన గంగాధర్ మద్యం తాగి బైక్ నడుపుతుండగా, పోలీసులు పట్టుకున్నారు. అనంతరం శుక్రవారం అతడిని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రెండ్రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అదేవిధంగా డ్రంకన్‌డ్రైవ్‌లో 8 కేసులు నమోదయ్యాయని, అందులో ఒకరికి జైలు, మరో ఏడుగురికి రూ.14వేలు జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ మహేష్ పేర్కొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం లక్ష్మీప్రియనగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. లక్ష్మీప్రియనగర్‌లోని సాయిరిధి అపార్టుమెంట్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో, వారు ఘటన స్థలానికి చేరుకొని ఆరుగురిని పట్టుకున్నారు. రూ. 15,160, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

రెండు కేజీబీవీల్లో ఇంటర్ ప్రారంభం

- మోర్తాడ్, నవీపేట్‌లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ


మోర్తాడ్‌లోని కస్తూర్బా పాఠశాల భవనం

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్, నవీపేట్ మండల కేంద్రాల్లోని కస్తూర్బా పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సీఈసీ, నర్సింగ్ కోర్సులలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు కోర్సులలో మొత్తం 80 మందికి అడ్మిషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలోనే అడ్మిషన్లు జారీ చేయనుండగా వచ్చే ఏడాది ద్వితీయ సంవత్సరానికి అప్‌గ్రేడ్ చేయనున్నారు. నర్సింగ్ కోర్సును గతంలోనే బాల్కొండ, నిజామాబాద్‌లలో ప్రవేశపెట్టారు. నర్సింగ్ కోర్సుకు గతంలో కంటే డిమాండ్ పెరగడంతో కస్తూర్బా పాఠశాలల్లో ఈ కోర్సులను అమలు చేస్తున్నారని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో 29 కస్తూర్బా పాఠశాలలు ఉండగా ఆర్మూర్, బాల్కొండ, భీమ్‌గల్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, మాక్లూర్, నిజామాబాద్, నందిపేట్‌లలో ఇంటర్ విద్యను గతంలోనే ప్రారంభించారు. తాజాగా రెండు కస్తూర్బాలకు ఇంటర్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆయా పాఠశాలల్లోని విద్యార్థినులకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని దొన్కల్ శివారులోగల వరద కాలువ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ముత్యం రాజు శుక్రవారం తెలిపారు. స్థానికులు సమాచారం అందించగా, ఘటన స్థలానికి వెళ్లి, తెల్లపూల చీర కట్టుకుని గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉన్న మహిళ మృతదేహంను స్వాధీనపరుచుకున్నామన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 35ఏళ్లు ఉంటుందన్నారు. ఎవరైనా కనిపించకుండా పోయిన మహిళదే ఈ మృతదేహం అయి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సెల్ నంబర్ 8712659867కు సంప్రదించాలన్నారు.

ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ ప్రియురాలి మృతి

టీటీపేట: రెండేళ్లుగా ప్రేమించుకోగా, పెళ్లికి ప్రియుడు నిరాకరించడంతో ప్రియురాలు ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన సుద్దాల శ్రీలత (23), నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన వడ్ల శివకృష్ణ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకొమ్మని ఇటీవల యువతి కోరడంతో ప్రియుడు పెళ్లికి నిరాకరించాడు. దీంతో ప్రియురాలు ఏప్రిల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా, యువకుడిపై వారు కేసు నమోదు చేసి ఏప్రిల్ 17న రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన యువకుడిని మళ్లీ పెళ్లి చేసుకోవాలని కోరింది. అంతే కాకుండా ఈ నెల 1న హైదరాబాద్‌లో ఇరువురు గొడవ పడగా, తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీలత విషగులికలు తీసుకొని ఆత్మహత్య యత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.


సుద్దాల శ్రీలత (ఫైల్)